# చెత్తకుప్పల్లోకి 24 కోట్ల కంప్యూటర్లు




## విండోస్ 10కు మద్దతును ఆపేస్తున్న మైక్రోసాఫ్ట్

### 2025 అక్టోబర్ వరకే 10 ఓఎస్ సేవలు అందరికీ అందుబాటులో

### ఆ తర్వాత అప్‌డేట్ వెర్షన్‌కు వినియోగదారులు వెళ్లాల్సిందే

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్)కు మద్దతును ఆపేసే దిశగా మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ అడుగులేస్తున్నది. ఇదిప్పుడు కోట్లాది వ్యక్తిగత కంప్యూటర్ల (పీసీలు) వినియోగదారులకు గుబులు పుట్టిస్తున్నది. విండోస్ 10 ఓఎస్ సేవలు నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా దానిపైనే ఆధారపడి నడుస్తున్న దాదాపు 24 కోట్ల పీసీలు చెత్తకుప్పల్లోకి చేరనున్నాయి మరి. అవును.. 2025 అక్టోబర్ వరకే విండోస్ 10కు మద్దతివ్వాలని మైక్రోసాఫ్ట్ నిర్ణయించింది. ఇదే జరిగితే ఈ ఓఎస్ ఆధారిత డివైజ్‌లు ఒక్కసారిగా నిరుపయోగంగా మారిపోనున్నాయి. మరో అప్‌డేట్ వెర్షన్ ఉన్న పర్సనల్ కంప్యూటర్లను అంతా కొనుక్కోవాల్సిందే. దీంతో పాత కంప్యూటర్లు ఈ-వేస్ట్‌గానే తయారవనున్నాయి.

**వార్షిక చార్జీలతో..**

2025 అక్టోబర్ వరకు విండోస్ 10 ఓఎస్ వినియోగదారులకు ఉచితంగా సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్న మైక్రోసాఫ్ట్.. ఆ తర్వాత మాత్రం ఇందుకు కొంతమేర వార్షిక చార్జీల (ఎంత? అన్నది తెలియాల్సి ఉన్నది)ను వసూలు చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇలా మరో మూడేండ్లు ఔట్‌డేటెడ్ పీసీలతో పనిచేసుకునే వెసులుబాటును కస్టమర్లకు కల్పించాలని సంస్థ భావిస్తున్నట్టు సమాచారం. అయితే 2028 అక్టోబర్ తర్వాత మాత్రం పూర్తిగా విండోస్ 10 ఓఎస్‌కు గుడ్‌బై చెప్పాలని మైక్రోసాఫ్ట్ నిర్ణయించినట్టు చెప్తున్నారు. దీంతో సెక్యూరిటీ అప్‌డేట్‌లు లేక వైరస్ సమస్యలు, పని నెమ్మదించడం వంటి ఇబ్బందులను కస్టమర్లు ఎదుర్కోనున్నారు.

**వ్యర్థాలతో ప్రత్యామ్నాయం..**

మైక్రోసాఫ్ట్ నిర్ణయంతో వచ్చే ఈ-వేస్ట్‌తో సమస్యలు ఏర్పడుతాయని ఓవైపు పర్యావరణ ప్రేమికులు వాదిస్తుంటే.. దానివల్ల ప్రత్యామ్నాయ ఉపయోగాలూ ఉన్నాయని మరోవైపు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. పర్సనల్ కంప్యూటర్లలో వాడే హార్డ్ డ్రైవ్‌లు, డాటా స్టోరేజీ సర్వర్లను రీసైక్లింగ్ చేస్తే ఎలక్ట్రిక్ వెహికిల్ మోటార్లలో వినియోగించే మెటీరియల్స్‌ను సిద్ధం చేసుకోవచ్చని, పునరుత్పాదక శక్తిని కూడా సృష్టించవచ్చని చెప్తున్నారు. విండ్ టర్బైన్లకు వినియోగించి విద్యుదుత్పత్తిని చేయవచ్చని నోవెన్ మ్యాగ్నెటిక్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ పీటర్ అఫ్నీ అంటున్నారు. ఈ-వేస్ట్ నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్, కాపర్ వంటి లోహాలను వెలికితీసి వాటిని బ్యాటరీల తయారీకి వాడుకోవచ్చని బ్యాటరీ రీసైక్లింగ్ సంస్థ రెడ్‌వుడ్ మెటీరియల్స్ చెప్తున్నది. ముఖ్యంగా విండోస్ 10 ఓఎస్ పనిచేయకపోతే తర్వాతి తరం ఓఎస్‌కు పీసీ వినియోగదారులు మారిపోతారని, దాని వల్ల ప్రస్తుతం మందగమనంలో ఉన్న పీసీ మార్కెట్‌లో తిరిగి అమ్మకాల ఉత్సాహం నెలకొంటుందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు వచ్చిన తర్వాత పీసీలకు మార్కెట్‌లో కొంతవరకు డిమాండ్ తగ్గిన విషయం తెలిసిందే.

### 48 కోట్ల కిలోల ఈ-వేస్ట్

*విండోస్ 10 ఓఎస్‌కు సపోర్ట్‌ను నిలిపివేయాలన్న మైక్రోసాఫ్ట్ నిర్ణయం 48 కోట్ల కిలోల ఈ-వేస్ట్‌కు దారితీస్తున్నదని కెనాలిస్ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఈ మొత్తం 3.2 లక్షల కార్ల బరువుతో సమానం కావడం గమనార్హం. దీనివల్ల పర్యావరణ అసమతౌల్యం ఏర్పడుతుందని, వాతావరణ మార్పులు, భూ కాలుష్యం ఉంటాయని చెప్తున్నది. ఇప్పటికే భూ తాపంతో వాతావరణంలో రకరకాల మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇవి మానవాళి, జంతుజాలం, ఇతర ప్రాణుల మనుగడనే దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ఈ-వేస్ట్ భూమిలోకి చేరితే మరిన్ని దుష్పరిణామాలు తప్పవని హెచ్చరిస్తున్నది. అంతేగాక విండోస్ 10 ఓఎస్ నుంచి కస్టమర్లను బలవంతంగా మరో అప్‌డేట్ వెర్షన్‌కు మార్చేపనే ఇదంతా అంటూ అభివర్ణించిన కెనాలిస్.. పీసీ యూజర్లపై అనవసర వ్యయ భారం వేస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది.*




## పల్సర్ మేనియా మాస్టర్స్ ఎడిషన్ అదుర్స్

ముంబై, డిసెంబర్ 22: బజాజ్ ఆటో తమ పాపులర్ మాడల్ బజాజ్ పల్సర్ పేరిట పల్సర్ మేనియా మాస్టర్స్ ఎడిషన్‌ను నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న పల్సర్ అభిమానులను ఏకం చేసేలా నిర్వహించిన ఈ ఈవెంట్‌లో 25వేల మందికిపైగా పాల్గొనగా, లక్షకుపైగా వీక్షకులు రావడం విశేషం. 100కు పైగా నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉత్సాహవంతమైన సాహసికులు పల్సర్ బైక్‌లతో అబ్బురపరిచే విన్యాసాలు చేశారు. ఈ క్రమంలోనే ముంబైలోని రిచర్డ్‌సన్ అండ్ క్రూడాస్‌లో నేషనల్ ఫినాలేను బజాజ్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఈ సందర్భంగా స్టైల్, ప్రెసిషన్, పవర్ జోన్ వంటి కస్టమైజ్డ్ ఛాలెంజ్ జోన్లు రైడర్ల ప్రతిభను పరీక్షించాయి. ఇందులో విజేతగా మహమ్మద్ నుమాన్ నిలవగా, రెండు, మూడు స్థానాల్లో జీత్ సింగ్, ఇనియవన్ రవిచంద్రన్ ఉన్నారు. విజేతలతోపాటు ఈ ఎడిషన్‌లో పాల్గొన్నవారందర్నీ బజాజ్ ఆటో లిమిటెడ్ మోటార్ సైకిల్ వ్యాపార విభాగం అధ్యక్షుడు సారంగ్ కనాడే ఈ సందర్భంగా అభినందించారు.

## రూ.5,500 కోట్ల ఐపీవోకు ఓలా ఎలక్ట్రిక్ రెడీ

ముంబై, డిసెంబర్ 22: ఎలక్ట్రిక్ టూవీలర్స్ తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ రూ.5,500 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి ఓలా ఎలక్ట్రిక్ సమర్పించింది. ఐపీవోలో రూ.10 ముఖవిలువ గల 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను జారీచేయాలని ప్రతిపాదించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన ఓలా ఎలక్ట్రిక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 3 లక్షల ఈ-స్కూటర్లను విక్రయిస్తుందని, 5.9 కోట్ల డాలర్ల రెవిన్యూ వస్తుందని అంచనా.

## రెండో రోజూ ర్యాలీ

### సెన్సెక్స్ 242 పాయింట్లు అప్

ముంబై, డిసెంబర్ 22: ఈ వారం మధ్యలో జరిగిన భారీ పతనం నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు వేగంగా కోలుకుంటున్నాయి. వరుసగా రెండో రోజూ సూచీలు పుంజుకున్నాయి. శుక్రవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ మరో 242 పాయింట్లు లాభపడి 71,107 పాయింట్ల వద్ద ముగిసింది. రెండు రోజుల్లో 600 పాయింట్లకుపైగా కోలుకున్నది. ఇంట్రాడేలో 394 పాయింట్లు పెరిగి 71,259 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 21,390 పాయింట్లకు పెరిగిన అనంతరం చివరకు 94 పాయింట్ల లాభంతో 21,349 పాయింట్ల వద్ద క్లోజయ్యింది.

## బీఈఎల్‌కు 2,673 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ ఇంజినీర్స్ లిమిటెడ్‌ల నుంచి ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు రూ.2,673 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి. గోవా షిప్‌యార్డ్ నుంచి రూ.1,701 కోట్లు, గార్డెన్ రీచ్ షిప్ నుంచి రూ.972 కోట్ల ఆర్డర్‌లు అందాయి. ఎలక్ట్రానిక్స్, అనుబంధ విభాగాలతోపాటు ఎంఎస్‌ఎంఈలకు సబ్ వెంచర్స్‌గా బెల్ వ్యవహరిస్తున్నది. కాగా, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఈ ఆర్డర్లు లభించాయి. దీంతో ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.25,935.15 కోట్ల విలువైన ఆర్డర్లున్నాయి.

## స్త్రీలు ఆర్థికంగా, స్వతంత్రంగా ఉండాలి

### రాష్ట్ర హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డైరెక్టర్ వీఎస్ అలుగు వర్షిణి



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మహిళలు ఆర్థికంగా, స్వతంత్రంగా ఉండాలని రాష్ట్ర హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డైరెక్టర్ వీఎస్ అలుగు వర్షిణి అన్నారు. మహిళల సాధికారత కోసం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలకు ఎఫ్‌టీసీసీఐ మరింత చేరువ కావాలని, జిల్లాల్లో బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధి కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు జీవనోపాధి కార్యక్రమాలు దోహద పడతాయని ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ చైర్మన్ భగవతీ దేవి అన్నారు. అనంతరం 15 మంది మహిళలకు పీకో మెషీన్లు పంపిణీ చేశారు.

## టీ-హబ్‌తో బియాండ్ నెక్స్ట జట్టు




ఒప్పంద పత్రాలతో బియాండ్ నెక్స్ట వెంచర్స్ సీఈవో సుయోషీ, టీ-హబ్ సీఈవో ఎంఎస్ రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో విజయవంతమైన స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న టీ-హబ్.. విదేశీ కంపెనీలతోనూ కలిసి పనిచేస్తోందని దాని సీఈవో మహంకాళి శ్రీనివాస రావు శుక్రవారం తెలిపారు. తాజాగా జపాన్‌కు చెందిన బియాండ్ నెక్స్ట వెంచర్స్‌తో టీ-హబ్ ఎంవోయూ కుదుర్చుకున్నట్టు చెప్పారు. టీ-హబ్‌తో కలిసి ఇండో-జపాన్ ఇన్నోవేషన్ కారిడార్‌ను బియాండ్ నెక్స్ట వెంచర్స్ ఏర్పాటు చేస్తున్నదన్నారు. కాగా, లోతైన శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు ప్రపంచానికి అందించేందుకు తమ ఈ ఒప్పందం కృషి చేయగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా ఆయన వ్యక్తం చేశారు. ఇక భారత్, జపాన్ స్టార్టప్‌ల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టామని, పెట్టుబడికున్న మార్గాలతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్‌ను సృష్టించే దిశగా నడుస్తామన్నారు.

## ఆకట్టుకున్న ఆజాద్ ఐపీవో

- **80 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్**




హైదరాబాద్, డిసెంబర్ 22: రాష్ట్రానికి చెందిన ఏరోస్పేస్, రక్షణ, ఎనర్జీ రంగ విడిభాగాల తయారీ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్ ఐపీవోకి అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీచేసిన షేర్లకు 80.60 రెట్లు అధికంగా బిడ్లు దాఖలయ్యాయి. శుక్రవారంతో పబ్లిక్ ఇష్యూ ముగియగా, 1,01,22,705 షేర్లకుగాను 81,58,60,388 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయని కంపెనీ పేర్కొంది. షేర్ ధరల శ్రేణి రూ.499-524గా ఉన్నది. ఇదిలావుంటే ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌తోపాటు పీవీ సింధు, సైనా నెహ్వాల్, వీవీఎస్ లక్ష్మణ్‌లకు ఈ సంస్థలో వాటాలుండటం విశేషం.

# చిత్రం



## ఎన్టీఆర్ అరుదైన ఘనత

అగ్రహీరో ఎన్టీఆర్ 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్‌స్టార్‌గా అవతరించాడు. తాజాగా ఆయన మరో ఘనతను కూడా సొంతం చేసుకున్నాడు. ఆసియాలో 2023 టాప్ 50లో నిలిచిన నటుల జాబితాను 'ఏషియన్ వీక్లీ' ప్రకటించింది. అందులో 25వ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో షారుక్‌ఖాన్ ప్రథమ స్థానంలో నిలవగా, పలువురు బాలీవుడ్ నటులు కూడా ఇందులో చోటు దక్కించుకున్నారు. అయితే, తెలుగు సినిమా నుంచి ఈ జాబితాలో స్థానం సంపాదించుకున్న ఏకైక నటుడు ఎన్టీఆర్ మాత్రమే. 'ఈ స్టర్న్ ఐ 2023' పేరిట ఈ జాబితాను విడుదల చేశారు. దీనితోపాటుగా అమెరికన్ మ్యాగజైన్ 'వెరైటీ' ఇటీవల ప్రకటించిన 500మంది అత్యంత ప్రతిభాశీలుర జాబితాలో తారక్, రాజమౌళిలకు చోటు దక్కడం విశేషం. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం తారక్ 'దేవర' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ ఆలీఖాన్ ప్రతినాయకునిగా నటిస్తున్నారు. కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజ్‌లో తొలిభాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.



దీపికా పదుకొణే

## సాహసాలు చేయాల్సొచ్చింది..

*'నాలో గతంలో చూడని చాలా కోణాలు 'ఫైటర్' సినిమాలో చూస్తారు. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఆలోచనా విధానం అద్భుతం. అతను సృష్టించిన పాత్రలు ఆడియన్స్ హృదయాల్లో నిలిచిపోతాయి' అంటున్నది బాలీవుడ్ భామ దీపికా పదుకొణే. హృతిక్‌రోషన్‌తో కలిసి ఆమె నటించిన చిత్రం 'ఫైటర్'. వచ్చేనెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులోని తన పాత్ర గురించి దీపిక పదుకొణే మాట్లాడింది. 'ఇది వీరోచిత ప్రేమగాథ. ఇందులో కథ రీత్యా సాహసాలు చేయాల్సొచ్చింది. ప్రాణాలమీదకు తెచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. టీమ్ ఎంతో శ్రద్ధతో తగిన జాగ్రత్తలూ తీసుకోవడంతో ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా బయటకు రాగలిగాం. ఎయిర్‌బేస్‌లో నిజమైన సుఖోయ్, భారతీయ యుద్ధ విమానాలతో సన్నివేశాలు చిత్రీకరించడం జరిగింది. ఈ సినిమా రషెస్ చూశాను. రొమాంచితంగా అనిపించింది. దర్శకుడు అద్భుతంగా తీశాడు. ఇందులో హృతిక్‌తో ఓ బీచ్ సాంగ్ చేశాను. ఆ పాటను మోస్ట్ రొమాంటిక్‌గా చిత్రీకరించాడు దర్శకుడు సిద్దార్థ్. ఒక్కమాటలో చెప్పాలంటే సినిమా చూస్తున్నప్పుడు హాలీవుడ్ సినిమా చూస్తున్న అనుభూతి' అంటూ చెప్పుకొచ్చింది దీపిక.*



ప్రభాస్

## 'సలార్' సీక్వెల్.. శౌర్యాంగ పర్వం

ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'సలార్' దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు అంతటా పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో భారీ ఓపెనింగ్స్ రాబడుతున్నది. ఈ సినిమాను రెండు భాగాలుగా తీయబోతున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సలార్' సీక్వెల్ టైటిల్‌ను 'పార్ట్-1' చివర్లో రివీల్ చేశారు. మొదటి భాగాన్ని 'సలార్-పార్ట్-1 సీజ్‌ఫైర్' పేరుతో విడుదల చేయగా, రెండో భాగానికి 'సలార్-2 శౌర్యాంగపర్వం' అనే పేరును ఖరారు చేశారు. అయితే ఈ సీక్వెల్ సెట్స్ మీదకు వెళ్లేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ తన తదుపరి చిత్రాన్ని ఎన్టీఆర్‌తో చేయబోతున్నాడు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'సలార్' సీక్వెల్‌ను పట్టాలెక్కిస్తారు.



భగీరథ, సుధాకర్, అనురాధా దేవి, ప్రసన్నకుమార్

## కృష్ణవేణి శతవసంత మహోత్సవం

'తెలుగువారు గర్వించే విదూషీమణి, లెజెండ్ కృష్ణవేణి. నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా అడుగుపెట్టిన ప్రతి రంగంలో తనదైన ముద్రవేసిన మహనీయురాలు శ్రీమతి కృష్ణవేణి' అని నిర్మాత, తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ అన్నారు. ఆకృతి ఆధ్వర్యంలో, సారిపల్లి కొండలరావు సౌజన్యంతో ఈ నెల 24న నిర్వహించే కృష్ణవేణి శత వసంత మహోత్సవానికి సంబంధించిన ఆహ్వానప్రతిక ఆవిష్కరణ సభ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడారు. 'ఎన్టీఆర్ లాంటి మహానటుడ్ని తెరకు పరిచయం చేసిన ఘనత కృష్ణవేణిది. అంతేకాదు ఎన్టీఆర్, ఏఎన్నార్ కలిసి నటించిన తొలి సినిమా 'పల్లెటూరి పిల్ల'కు నిర్మాత కూడా కృష్ణవేణిగారే. వందేళ్లు నిండిన ఆ మహాకళాకారిణికి తెలుగు సినిమా ఎప్పటికీ రుణపడివుంటుంది' అని ప్రసన్నకుమార్ అన్నారు. 'ఈ నెల 24న హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్ ప్రివ్యూ థియేటర్‌లో ఆకృతి సంస్థ నిర్వహించే 'కృష్ణవేణి శత వసంత మహోత్సవ' కార్యక్రమానికి పలువురు చిత్ర ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా హాజరుకాబోతున్నారు' అని 'ఆకృతి' సుధాకర్ తెలిపారు.

## విఫల ప్రేమ జ్ఞాపకాలు

తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే తన సీనియర్ అయిన ఓ అబ్బాయి ప్రేమలో పడ్డానని, అయితే ఆ బంధం ఎక్కువ కాలం నిలవలేదని చెప్పింది పంజాబీ భామ తాప్సీ. కెరీర్ ఆరంభంలో తెలుగులో గ్లామర్ నాయికగా పేరు తెచ్చుకున్న ఈ భామ అనంతరం హిందీ చిత్రసీమలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడ మహిళా ప్రధాన ఇతివృత్తాలను ఎంచుకొని ప్రతిభను నిరూపించుకుంది. వైవిధ్యమైన కథలకు చిరునామా తాప్సీ అనే పేరును సంపాదించుకుంది. ఇటీవల విడుదలైన 'డంకీ' చిత్రంలో షారుఖ్‌ఖాన్‌తో జోడీగా తనదైన నటనతో ఆకట్టుకుంటున్నది తాప్సీ. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన పాఠశాల ప్రేమాయాణం గురించి చెప్పుకొచ్చింది. 'ఆ అబ్బాయి నా సీనియర్. నాతో చనువుగా ఉండేవాడు. ఏమైందో ఏమోగానీ ఒక్కసారిగా మాట్లాడటం మానేశాడు. ప్రేమ వ్యవహారం వల్ల తాను చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నానని బాధ పడేవాడు. అలా నా నుంచి క్రమంగా దూరమయ్యాడు. విడిపోయే ముందు నేను బాగా చదువుకొని లైఫ్‌లో సక్సెస్ కావాలని ఓ సలహా కూడా ఇచ్చాడు. అయితే నిజమైన ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలియని ప్రాయం కాబట్టి ఆ విఫల ప్రేమ జ్ఞాపకాలు కొన్ని రోజులు బాధించాయి' అని చెప్పింది తాప్సీ.



తాప్సీ



జీవా, మమ్ముట్టి

## రాజకీయ ఘటనల 'యాత్ర-2'

దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఆధారంగా మమ్ముట్టి ప్రధాన పాత్రలో రూపొందించిన 'యాత్ర' చిత్రం చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి జీవితంలో జరిగిన కీలక రాజకీయ సంఘటనలను ఆవిష్కరిస్తూ 'యాత్ర-2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహి వి రాఘవ్ దర్శకుడు. వై.యస్.జగన్మోహన్ రెడ్డి పాత్రలో తమిళ నటుడు జీవా కనిపించనున్నారు. ఇటీవల స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. వై.యస్.జగన్ ప్రజానాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఈ సినిమాలో ఆవిష్కరిస్తున్నామని, ఫిబ్రవరి 8న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు.